ప్రజాశక్తి
సోమవారం 26 మే, 2025
5
శ్రీకాకుళం



ఇంటి పన్నుకు ఆధార్ అనుసంధానం

నరసన్నపేట: నరసన్నపేట గ్రామ పంచాయతీ గృహ యజమానులు తమ ఇంటి పన్నుకు ఆధార్, ఫోన్ నంబర్లను అనుసంధానం చేయాలని పంచాయతీ కార్యనిర్వహణాధికారి పి.ద్రాక్షాయిని తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఈ కార్యక్రమంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీ ఇంటి పన్ను ఆన్‌లైన్‌లో భాగంగా ప్రభుత్వం ఆదేశాలను అనుసరించి గృహ యజమానుల ఆధార నంబరు, ఫోన్ నంబరు ఇంటి పన్నునకు అనుసంధానం చేసేందుకు గృహ యజమానులు సహకరించాలని కోరారు. కార్యాలయంలోని కంప్యూటర్ ఆపరేటర్ 9032891811కు ఫోన్ నంబరుకు మెసైజ్, whatsapp ద్వారా గాని మీ ఇంటి పన్ను అసెస్మెంట్ నంబరు, పేరు, ఆధార్, ఫోన్ నంబర్లపు పంపించాలని అన్నారు. లేకుంటే కార్యాలయానికి పనివేళల్లో వచ్చి నమోదు నమోదు చేసుకోవాలన్నారు.

రైతు బ(బే)జారు!

- బస్టాండ్, రోడ్లపై వ్యాపారాలు చేస్తున్న రైతులు
- స్థల వివాదంతో ఆగిన వైనం



కాశీబుగ్గ బస్టాండ్‌లో కూరగాయలు విక్రయిస్తున్న ఉద్దాన ప్రాంత రైతులు



స్థల వివాదం రైతు బజార్ స్థలం

ప్రజాశక్తి- పలాస

జిల్లాలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ ఒకటి. ఈ ప్రాంతంలో రైతుబజార్ ఏర్పాటు చేయాలని ఇక్కడ ప్రజల చిరకాల కోరిక. పాలకులు, అధికారుల అలసత్వం ఒక వైపు అయితే మరో వైపు స్థల వివాదంతో రైతు బజార్ నిర్మాణం బేజారుగా మారింది. కరోనా సమయంలో తాత్కాలికంగా రైతుబజార్ ఏర్పాటుకు మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు ప్రారంభించిన కొద్ది రోజులకే కనుమరుగైంది. ఎన్నో ఏళ్ళుగా పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీతో పాటు మందస, వజ్రపుకొత్తూరు, పలాస, మండలాలు నుంచి వ్యాపారులు తీసుకు వచ్చిన పంటలు, కూరగాయలు రోడ్లపై కూర్చుని అమ్మకాలు చేపట్టాల్సిన పరిస్థితి నెలకొంది.

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీపై పలాస, మందస, వజ్రపుకొత్తూరు, నందిగాం, మెళియాపుట్టి మండలాలకు చెందిన వందలాది గ్రామాల ప్రజలు ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఆయా మండలాల్లో పండిస్తున్న కూరగాయలు పళ్ళు చిరు ధాన్యాలను పలాస-కాశీబుగ్గ తీసుకువచ్చి విక్రయిస్తుంటారు. వాస్తవానికి రైతుబజార్ అవసరమైనప్పటికీ లేకపోవడంతో కాశీబుగ్గ బస్టాండ్ మూడు రోడ్ల కూడలి కె.టి.రోడ్డు పక్కల పెట్టుకుంటూ వ్యాపారం సాగిస్తున్నారు. ఉద్దానం ప్రాంతంలో పండిస్తున్న కూరగాయలు పళ్ల చిరుధాన్యాలను తక్కువ ధరలకే అమ్ముకుంటూ తీవ్రంగా నష్టపోతున్నామని ఆయా ప్రాంత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతు బజారు ఉంటే ఇటువంటి పరిస్థితి ఉండేది కాదని వాపోతున్నారు. మరోవైపు తీసుకు వచ్చిన తక్కువ వస్తువులపై మున్సిపాలిటీ పన్నులు వేస్తూ అధిక భారాన్ని మోపుతుండడంతో ఇబ్బందులు పడుతున్నారు.

తాత్కాలిక రైతుబజార్ ఏది?

పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లో పట్టణ ప్రజలతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వస్తున్న రైతులు రైతుబజార్ లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతుబజార్ లేక రైతుల అవస్థలు పడుతున్నారని వారిని ఆదుకోవాలనే మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కాశీబుగ్గ మూడు రోడ్ల కూడలి సమీపంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో రైతుబజార్ తాత్కాలికంగా ప్రారంభం చేశారు. కొద్దిరోజులకే కనుమరుగు కావడంతో యధావిధిగా మరలా బస్టాండ్ ఆవరణలో రోడ్లపై కూర్చుని వ్యాపారం చేసే పరిస్థితి నెలకొంది. పాలకులు అధికారులు పూర్తిస్థాయిలో చొరవ చూపకపోవడంతో ఈ ప్రాంతంలో రైతుబజార్ ఏర్పాటుకు నోచుకోలేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

స్థల వివాదంతో ఆగిన వైనం

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీకి రైతుబజార్ అవసరం. పలాస-కాశీబుగ్గ జంట పట్టణాలపై పదుల సంఖ్యలో గ్రామాలు ఆధారపడి వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. రైతులకు అండగా నిలవాలని పట్టణ ప్రజలకు తక్కువ ధరతో కూరగాయలు అందుబాటులో ఉంచాలనే ఉద్దేశంతో అప్పటి ఎమ్మెల్యే గౌతు శ్యాంసుందర శివాజీ కాశీబుగ్గ న్యూ కాలనీ సమీపంలో కాశీబుగ్గ రెవెన్యూ పరిధిలో 207/2 బి సర్వే నంబరులో సోషల్ వెల్ఫేర్‌కు చెందిన 27 సెంట్లు స్థలాన్ని కేటాయించారు. నిర్మాణానికి రూ.40 లక్షలు మంజూరు చేశారు. ఆ సమయంలో ఆ ప్రాంతంలో చాలా ఏళ్ల నుంచి చిన్న చిన్న దుకాణాలు పెట్టుకుంటూ జీవనం సాగిస్తుండడంతో స్థల వివాదం సమస్యగా మారింది.

అప్పటి నుంచి నేటివరకు స్థల వివాదం సద్దుమణకపోవడంతో రైతుబజార్ ఏర్పాటు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే చందంగా తయారైంది. ఇప్పటికైనా అధికారులు పాలకులు చొరవ చూపి నిర్మాణం కోసం కృషి చేయాలని పట్టణ ప్రజలతో పాటు ఇతర ప్రాంత ప్రజలు రైతులు కోరుతున్నారు. ఈ విషయంపై పలాస ఎఎంసి కార్యదర్శి ఆంద్రయ్య వివరణ కోరగా స్థల వివాదం వల్ల రైతుబజార్ నిర్మాణం చేపట్టకపోయామన్నారు. రైతుబజార్ కోసం గతంలో రూ.40 లక్షలు మంజూరు చేశారు. స్థల వివాదంతో రైతుబజార్ ఏర్పాటు చేయలేకపోయాం. రైతుబజార్ ఏర్పాటు కోసం స్థల వివాద సమస్యను పరిష్కరించాలని ఉన్నతాధికారులతో పాటు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.



మాట్లాడుతున్న సిర్ల ప్రసాద్

గిరిజనుల భూ సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి- హిరమండలం

మండలంలోని గులుమూరు పంచాయతీ జగన్నాథపురం గిరిజనులు భూ సమస్యను పరిష్కరించాలని, లేకుంటే తహశీల్దార్ కార్యాలయం ముట్టడిస్తామని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్ హెచ్చరించారు. ఆదివారం జగన్నాథపురంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో హక్కు పత్రాలను గిరిజనులు చూపించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగన్నాథపురం గిరిజనులు భూములను గిరిజనేతరులు అక్రమంగా ఆక్రమించారని అన్నారు. గిరిజనులు భూ సమస్యను పరిష్కరించాలని, తహశీల్దార్ జోక్యం చేసుకోవాలని, లేకుంటే హక్కు పత్రాలు కలిగిన గిరిజనులకు భూములను అప్పగించాలని డిమాండ్ చేశారు. గిరిజనులు జీవనోపాధి కోసం 40 ఏళ్ల క్రితం సర్వే నంబరు 284, 284బి1లో భూ పంపిణీ చేసి హక్కు పత్రాలు ఇచ్చిందని తెలిపారు. గిరిజనులు సాగులో ఉన్న భూములను కొండరాగోలుకు చెందిన వారు అక్రమంగా ఆక్రమించి తప్పుడు కాగితాలు చూపించి గిరిజనులు భూములను ఆక్రమించారని అన్నారు. తహశీల్దార్ స్పందించి గిరిజనులు భూములను రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఊలక భవాని, రుగడ నర్శయ్య, ఆదిలక్ష్మి, భీముడు చిన్నమ్మి, గార రామయ్య, సేతోడు, సిఐటియు.నాయకులు పి.కృష్ణ పాల్గొన్నారు.

నేడు ప్రజా పరిష్కార వేదిక

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



శ్రీకాకుళం: ఈ నెల 26న ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక జిల్లా పరిషత్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో వెల్లడించారు. అర్జీదారులు వారి అర్జీలు నమోదు చేసుకోవడానికి Meekosam.ap.gov.in (మీకోసం డాట్ ఎపి డాట్ జిఒ వి డాట్ ఇన్) వెబ్‌సైట్‌లో వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. అర్జీదారుల అర్జీల నమోదు, నమోదైన అర్జీల గురించి వాటి స్థితి, దానికి సంబంధించి సమాచారం గురించి తెలుసుకోవాలంటే 1100కి నేరుగా కాల్ చేయవచ్చని వివరించారు. అర్జీదారులు గమనించి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రెచ్చిపోయిన కాశీబుగ్గ రూరల్ సిఐ

మాజీ మంత్రిని పరుష పదజాలతో దూషించిన వైనం



మాజీ మంత్రితో సిఐ వాగ్వివాదం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మాజీ మంత్రి సీదిరి అప్పలరాజుపై కాశీబుగ్గ రూరల్ సిఐ తిరుపతి రెచ్చిపోయిన ఘటన ఆదివారం వజ్రపుకొత్తూరు పోలీస్‌స్టేషన్ వద్ద చోటుచేసుకుంది. పోలీసులు పనితీరును ప్రశ్నించిన మాజీ మంత్రిపై నిగ్రహం కోల్పోయిన సిఐ దురుసుగా వ్యవహరించారు. మాజీ మంత్రి అని చూడకుండా వేళ్లు చూపిస్తూ ఏం తమాషా అంటూ పరష పదజాలంతో దురుసుగా ప్రవర్తించారు. మండలానికి చెందిన బాధితుడు గూడ ధనరాజ్ తన గొర్రెల కోసం ఏర్పాటు చేసుకున్న షెడ్ విషయంపై తగదా చోటు చేసుకుంది. బాధితుడు ధనరాజు గత 20 ఏళ్లగా గొర్రెల కాపారిగా జీవనోపాధి సాగిస్తూ తనకున్న గొర్రెల రక్షణ కోసం తనకు ఉన్న అస్తిలో గొర్రెల శాలను ఏర్పాటు చేసుకున్నాడు. అయితే ఇటీవల కురిసిన గాలి వానకు గొర్రెల శాల మరమ్మతులకు గురైంది. గొర్రెల షెడ్‌ను పున్ణనిర్మాణం చేస్తున్న సమయంలో అదే గ్రామానికి చెందిన కొంత మంది టిడిపి నాయకులు వ్యక్తిగత కక్షతో బాధితుడు, ఆయన భార్య లక్ష్మితో వాగ్వాదానికి దిగి గొర్రెల శాలను కూల్చే ప్రయత్నం చేశారు. దీంతో బాధితులు ప్రతిఘటించగా, వారిపై దాడి చేశారు. ఈ విష యంపై బాధితులు పోలీసులను ఆశ్రయించగా పోలీసులు స్పందించలేదు. కాగా, నిందుతులు ముందుగానే పోలీస్‌స్టేషనలో ఫిర్యాదు చేయడంతో బాధితులను పిలిచి రోజాంతా స్టేషన్లో ఉంచారు. కాగా, గత కొంత కాలంగా బాధితులు పెంచుకుంటున్న మేకలను దుండగలు అపహరిస్తున్నారు. ఇప్పటికే బాధితుడు, బంధువులకు చెందిన 25 మేకలను వ్యక్తిగత కక్షలతో దొంగతనం చేస్తూ తమ జీవనోపాధిని దెబ్బతీస్తున్నారు. ఈ విషయంపై పోలీసులకు అనేకసార్లు ఫిర్యాదు చేసినా తమకు జరిగిన అన్యాయాన్ని పోలీసుల వద్ద మొరపెట్టుకున్నా ప్రయోజనం లేదని బాధితులు వాపోయారు. అలాగే ఆదివారం తమపై జరిగిన దాడిపై ఫిర్యాదు చేయడానికి పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన బాధితులతో పోలీసులు దుర్భాషలాడుతూ ఫిర్యాదు తీసుకోలేదని బాధితులు అవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. బాధితుల పక్షాన నిలిచి బాధితులకు జరిన అన్యాయంపై పోలీసులను నిలదీశారు. బాధితులు అందించిన ఫిర్యాదును ఎందుకు తీసుకోలేదని పోలీసులను ప్రశ్నించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదును పోలీసులు అందుకోని రశీదు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో సిఐ దురుసు ప్రవర్తన ఉద్రిత వాతావరణానికి దారితీసింది. కాసేటి తర్వాత బాధితులు నుంచి పోలీసులు ఫిర్యాదు తీసుకోవడంతో పరిస్థితి సర్దుమణిగింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన పోలీసులు కూటమీ నాయకులకు కొంగు కాయటం సరికాదని అన్నారు. బాధితులకు అండగా నిలిచి వారి పక్షాన నిలబడి న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు.

విప్‌కు తలనొప్పిగా మారిన టౌన్ అధ్యక్ష ఎంపిక

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం పట్టణ టిడిపి అధ్యక్ష పదవి ఎంపిక ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌కి తలనొప్పిగా మారింది. పట్టణ అధ్యక్షు పదవి కోసం గత కొన్నేళ్లుగా పలువురు ఆశ పడ్డారు. అధ్యక్ష పదవి కోసం చిత్త శుద్ధిగా పనిచేసిన నాయకులు లేకపోలేదు. దశాబ్దాలుగా కొనసాగుతున్న పట్టణ అధ్యక్ష పదవి మార్పు తప్పనిసరి కావడంతో ఈసారి అధ్యక్ష పదవి కోసం గట్టి పోటీ ఏర్పడింది. దీంతో రెండు ప్రధాన సామజిక తరగతులకు చెందిన యాదవ, రెడ్డిక చెందిన నాయకులు, టిడిపి వార్డు కౌన్సిలర్ పత్రీ తవితియ్య, పట్టణ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్న నందిక జాని మధ్య తీవ్ర పోటీ నెలకొంది. రాజకీయ సమీకరణాల నేపథ్యంలో పట్టణ అధ్యక్ష పదవి యాదవ సామజిక తరగతి కేటాయించాలన్న ఆలోచనతో ఆశావహులు నిరుత్సాహపడ్డారు. అనుకోకుండా పార్టీ నేతలు ఇటీవల అమ్మవారు ఆలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. దీంతో అది రసాభాస కావడంతో విప్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. అవసమున్న సమయంలో ఎప్పుడు సమావేశం కానీ పట్టణ టిడిపి నేతలు అధ్యక్ష పదవి ఖారారు చేస్తున్న సమయంలో సమావేశం ఏర్పాటు చేసి అభాసుపాల య్యారు. ఈ సమావేశంలో మరో నలుగురు పేర్లు కూడా పరిశీలనలో తీసుకుని మొత్తం ఆశ పడుతున్న నేతలు జాబితాను విప్‌కు అందజేశారు. కొత్తగా పోటీలోకి వచ్చిన నేతల్లో ప్రస్తుత పట్టణ అధ్యక్షుడు తనయుడు, నియోజకవర్గ యువత అధ్యక్షునిగా బాధ్యతలు నిర్వహిస్తున్న కాళ్ల జయదేవ్, మాజీ కౌన్సిలర్, యువ న్యాయవాది నాగరాజు పాత్రో, మాజీ కౌన్సిలర్ కొర్రియా ధర్మరాజు తమ పేర్లు కూడా పరిశీలనలో తీసుకోవాలని జాబితాను విప్‌కు అందజేశారు. అయితే ఇందులో ప్రధానంగా ముగ్గురు పేర్లు పరిశీలించి ఎన్నిక అభిప్రాయాలు సేకరించాలని పార్టీ పెద్దలు ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. యాదవ్‌కు చెందిన పత్రీ తవిటియ్య, కాళ్ల జయదేవ్, రెడ్డికి చెందిన నందిక జాని ముగ్గురు లో ఒక్కరిని ఎంపిక చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. బహిరంగ సేకరణ అయితే ఒకలాగా, రహస్యంగా సేకరణ జరిగితే మరొకలా ఎంపిక ఉంటుందని పార్టీ సీనియర్లు అంటున్నారు. అధ్యక్ష పదవి కోసం ఆశావహుల్లో ఒకరు ప్రతిపక్ష పార్టీ నేతలతో రాయబారాలు నడుపుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇదే నిజమైతే పార్టీ మనుగడకి తీవ్ర ప్రభావం చూపుతోందని సీనియర్లు వ్యాఖ్యానిస్తున్నారు. మెజారిటీ కేడర్ ఎవ్వరికి ఎంపిక చేస్తే ఎంపిక కావడం మంచి పద్ధతి అని అంటున్నారు. ఏదేమైనా రానున్న ఎన్నికల్లో ఈసారి మున్సిపాలిట లో టిడిపి జెండా ఎగురవేయ్యాలన్న గట్టి పట్టుదలతో విప్ ఆచితూచి అడుగులు వేస్తునట్టు అర్ధమవుతుంది. మున్సిపాలిటీ ఏర్పడి ఇప్పటి వరకు ఒకేసారి టిడిపి విజయం సాధించింది. మిగిలిన అన్నిసార్లు కాంగ్రెస్, వైసిపి నేతలే మున్సిపల్ అధ్యక్ష పదవిలో ఉన్నారు. ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో మున్సిపాలిటీ టిడిపికి మెజరిట్ ఓటింగ్ వస్తుంది. కానీ, మున్సిపల్ ఎన్నికలో ఓటమి చెందడం పార్టీ పెద్దలు చాలా సిరియస్‌గా తీసుకున్నారు. మంచి నాయకత్వంతో ఈసారి మున్సిపల్ పీఠం టిడిపి కైవసం చేసుకోవా లని పట్టుదలతో ఉన్నట్లు తెలుస్తుంది. అధ్యక్ష ఎంపికతో టిడిపి నేతలు కలిసిమెలసి ముందుకు వెళ్తారా? లేదని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మొత్తం మీద పట్టణ అధ్యక్షుడు ఎంపిక విప్‌కు తలనొప్పి వ్యవహారంగా మారింది.


అలరించిన నృత్య ప్రదర్శన



ప్రజాశక్తి- శ్రీకాకుళం

జపాన్‌లో రఘుపాత్రుని శ్రీకాంత్ బృందం తన నాట్య రీతులతో విశేషంగా ఆకట్టుకుంటోంది. ఎపి ప్రభుత్వ సహకారంతో ఇక్కడి నుంచి వెళ్లిన ఆరుగురు సభ్యులతో కూడిన బృందం తమ కళా ప్రదర్శనతో అబ్బురపరిచారు. ఇక్కడి భారత్ పెవీలియన్ సెంటర్ (ఒసాకా, జపాన్)లో నిర్వహిస్తున్న వరల్డ్ ఎక్స్ పో-2025 లో భాగంగా ఎపి నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న శ్రీకాంత్ శిష్య బృందం కూచి పూడి నృత్య విశేషాలు వివరిస్తూ ప్రదర్శనలు ఇవ్వడం అక్కడి వారిని ఎంతగానో మంత్ర ముగ్ధులను చేసింది. కార్యక్రమానికి జపాన్, భారత్ అంబాసిడర్లు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. శ్రీకాంత్ శిష్య బృందం ప్రదర్శనకు అక్కడకు విచ్చేసిన వారందరూ నిల్చొని తమ కరతాళ ధ్వనులను అందించారు. డాక్టర్ రఘుపాత్రుని శ్రీకాంత్ శిష్యులైన శ్రీభాష్యం సుందర రామ కౌండిన్య, నేహా పట్నాయక్, గాయత్రి వర్షిత, అన్నా నేహా థామస్, చాందిని, లలిత ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. జపాన్ పర్యటనకు తమను ఎంపిక చేసి, తగిన విధంగా ప్రోత్సాహం అందించి, కూచిపూడి నృత్య వైభవం ప్రపంచ స్థాయిలో చాటి చెప్పేందుకు అవకాశం ఇచ్చిన ఎపి ప్రభుత్వానికి, సాంస్కృతిక శాఖకు, ఎపి ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డు (ఎపిఇడిబి) నిర్వాహకులకూ తన బృందం తరపున శ్రీకాంత్ కృతజ్ఞతలు తెలిపారు.

పారదర్శకంగా బదిలీలు



డిఇఒకి సమస్యలు వివరిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి- కవిటి

ప్రభుత్వం చేపడుతున్న ఉపాధ్యాయ బదిలీలు పారదర్శకంగా చేపట్టాలని పలువురు ఉపాధ్యాయులు కోరారు. ఈ మేరకు శ్రీకాకుళంలోని జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం వద్దకు చేరుకుని తమ సమస్యలు ఏకరువుపెట్టి, పరిష్కరించాలని నినాదాలు చేశారు. డిఇఒ తిరుమల చైతన్యను కలిసి తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఉపాధ్యాయ బదిలీల్లో సర్వీస్ పాయింట్లు, స్టేషన్ పాయింట్లు, స్పెషల్ పాయింట్లతో చాలామందికి అన్యాయం జరుగుతున్నట్టు వాపోయారు. దీంతో ఒకే పాఠశాలలో 8 ఏళ్ళ పనిచేసిన వారికి గరిష్ట సీలింగ్ విధానంతో బదిలీల్లో నష్టం జరుగుతున్నట్టు తెలిపారు. తమ సమస్యలు దృష్టిలో ఉంచుకుని గరిష్ట కాలానికి మొత్తం స్టేషన్ పాయింట్లలో ఎటువంటి సీలింగ్ లేకుండా బదిలీలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో జిల్లాలోని పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న పోలీస్

శ్రీకాకుళం: జిల్లాలో నేర నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో సిఐలు, ఎస్ఐలు రౌడీషీటర్లకు, నేరచరిత్రగల వారికి, పాత నేరస్తులకు, చెడునడవడిక కలిగిన వ్యక్తులకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ క్రమంలో శ్రీకాకుళం ఒకటో పట్టణ పోలీస్‌స్టేషను సహా జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీసు స్టేషనులో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. చెడు అలవాట్లకు స్వస్తి చెప్పి సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. ఎవరైనా దానికి భిన్నంగా వ్యవహరిస్తే ఉపేక్షించిదిలేదని స్పష్టం చేశారు. ఎక్కడ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా చర్యలు తప్పవని పోలీసు అధికారులు హెచ్చరించారు. పోలీసుల ఆదేశాలు, సూచనలను పెడచెవిన పెట్టి ప్రజా శాంతికి భంగం కలిగిస్తే చట్టపరమైన మరింత కేసులు నమోదు చేస్తామని తెలిపారు. అనుమానితుల కదలికలను పోలీసుశాఖ ఎల్లప్పుడూ గమనిస్తూ ప్రత్యేక నిఘా ఉంచుతోందని, నేర ప్రకృత్తి విడనాడాలని హితవు పలికారు.

బీడు భూముల్లో ఉద్యాన పంటల సాగుకు ప్రణాళికలు

జిల్లా ఉద్యానశాఖ అధికారి వరప్రసాద్





ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

ఉద్యాన పంటల సాగుతో బీడు భూములను సైతం సాగులోకి తీసుకొచ్చేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని జిల్లా ఉద్యాన శాఖ అధికారి రత్నాల వరప్రసాద్ చెప్పారు. జిల్లాల ప్రస్తుతం 1,10,625 ఎకరాల్లో ఉద్యాన పంటలు విస్తరించి ఉన్నాయని తెలిపారు. జిల్లాలో సుమారు 28,540 ఎకరాలు నిరుపయోగంగా ఉన్నట్లు గుర్తించామన్నారు. వీటిలో సుమారు 8,875 ఎకరాల భూమికి తగిన నీటి వసతి కల్పించే రైతులను చైతన్యపరచడం ద్వారా సాగులోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపడుతున్నామని వివరించారు. బహుళ వార్షిక పంటలకు వెంటనే ఆదాయం రాదని, నిరాశకులోను కాకుండా కూరగాయలు, బొప్పాయి, అరటి వంటి అంతర్ పంటలు సాగుతో అదనపు ఆదాయం సమకూరుతుందన్నారు. ఉద్యాన పంటల సాగుతో గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు మెరుగుపడే వలసల నివారణకు దోహదపడుతుందని చెప్పారు. దీంతోపాటు ఉద్యాన శాఖ ద్వారా అమలవుతున్న వివిధ రకాల పథకాలు, ప్రభుత్వం అందిస్తున్న రాయితీల వివరాలు తదితర అంశాలపై 'ప్రజాశక్తి' ముఖాముఖిలో మాట్లాడారు.

? జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో ఉద్యాన శాఖ ద్వారా చేపట్టనున్న ప్రత్యేక ప్రణాళికలు వివరించగలరు?

సుదీర్ఘ సముద్ర తీరం, వివిధ జీవవైవిధ్య పరిస్థితులు నెలకొన్ని ఉన్న జిల్లాకు ఉద్యాన పంటలను ప్రోత్సహించడానికి ఎపి ప్రభుత్వం వివిధ విస్తరణ పథకాలను ప్రోత్సహిస్తుంది. ఇందుకు ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాకు 14195 ఎకరాల విస్తరణా పథకానికే భౌతిక లక్ష్యంగా నిరసిస్తూ రూ.2.62 కోట్ల బడ్జెట్‌ను కూడా కేటాయించారు. అదేవిధంగా ఈ ఖరీఫ్ మొదలయ్యేలోపు సాగుకు యోగ్యమయ్యే బీడు భూములను గుర్తించి, అక్కడ కూడా ఉద్యాన పంటలను వేసుకునేలా రైతులను గుర్తిస్తున్నాం.

? జిల్లాలో ఎన్ని ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగవుతున్నాయి? ఎన్ని ఎకరాలు ఖాళీగా ఉన్నాయి? అందులో ఎంత మేర ఉద్యాన పంటలకు అనుకూలంగా ఉన్నాయి.

శ్రీకాకుళం జిల్లాలో ప్రస్తుతం 1,10,625 ఎకరాల్లో ఉద్యాన పంటలు విస్తరించి ఉన్నాయి. అయితే జిల్లాలో సుమారు 28,540 ఎకరాలు నిరుపయోగంగా, ఎటువంటి పంటలు సాగు చేయకుండా ఉన్నాయి. ఇందులో సుమారు 8,875 ఎకరాలు తగిన నీటి వసతి కల్పిస్తూ స్థానిక రైతులను చైతన్య పరిస్తే సాగుకు యోగ్యంగా ఉన్నాయి. ఈ 8,875 ఎకరాలు కలిగిన రైతులను తొలకరి లోపు గుర్తించి వాటిలో ఉద్యాన పంటలు చర్యలు చేపడుతున్నాం.

? పంటల సాగు విస్తరణ పథకాల కింద జిల్లాలో ఏయే పంటలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు

జీడిమామిడి, మామిడి, అరటి, బొప్పాయి, కూరగాయలు, జామ, పూలు, పనస, ఉసిరి, కొబ్బరి, కోకో, ఆయిల్‌పామ్ తదితర పంటలను వివిధ విస్తరగా పథకాల కింద సాగయ్యేలా ప్రాధాన్యత ఇస్తున్నాం. ఇవి కాకకుండా శాశ్వత పందిళ్లను ఏర్పాటు చేసి డ్రాగన్ ఫ్రూట్, వివిధ తీగ జాతి కూరగాయలను కూడా ఈ పథకంలో వర్తింపజేస్తున్నాం. గత ఆర్థిక సంవత్సరం నుంచి వెదురును కూడా ఉద్యానశాఖ, విస్తర పథకం కింద వర్తింపజేస్తూ సాగుకు ప్రోత్సహిస్తున్నాం.

? రైతులు ఎక్కువగా ఏయే రకాల ఉద్యాన పంటల వైపు మొగ్గు చూపుతున్నారు?

మారుతున్న జీవనశైలి, పెరుగుతున్న ప్రజావసరాలు, డిమాండ్ దృష్ట్యా ప్రస్తుత కాలంలో రైతులు డ్రాగన్ ఫ్రూట్, జామ, అంమామిడి, వంటి పళ్ల తోటలను, ఆయిల్‌పామ్, కోకో వంటి వాణిజ్య పంటల వైపు మొగ్గు చూపిస్తున్నారు. అదేవిధంగా సాంప్రదాయ పంటలైన జీడిమామిడి, కొబ్బరి వంటి పంటలకు కూడా ఆసక్తి చూపిస్తున్నారు.

? పంట సాగుకు రైతులకు అందివ్వనున్న రాయితీల వివరాలు వెల్లడించగలరు?

డ్రాగన్ ఫ్రూట్ రూ.1,62,00, మామిడి రూ. 30 వేలు, జీడిమామిడి రూ.18 వేలు, జామి రూ.48 వేలు, కోకో రూ.18 వేలు, అరటి రూ.42 వేలు, బంతి, చామంతి, కనకాంబరం రూ.20 వేలు, సకంర జాతి కూరగాయలు రూ.24 వేలు, బొప్పాయి రూ.18 వేలు, పైనాపిల్ 18 వేలు, మల్చింగ్ రూ.19 వేలు ఎకరాకు రాయితీ వర్తిస్తుందన్నారు. అదేవిధంగా ఆయిల్‌పామ్ పంట వేసుకునే రైతులకు కంపెనీల ద్వారా మొక్కలను ఉచితంగా అందించడంతో పాటు నాలుగేళ్ల సంరక్షణ కోసం కూడా రాయితీ ఇస్తున్నాం. కొబ్బరి విస్తరణకు బారువ హార్టికల్చర్ ఫామ్ నుంచి తీసుకున్న మొక్కకు రూ.రూ.40 చొప్పున రాయితీ అందిస్తున్నాం.

సమీకృత అభివృద్ధి పథకం కింద ఎన్ని ఎకరాల్లో ఉద్యాన పంటలను అభివృద్ధి చేయనున్నారు?

సమగ్ర ఉద్యాన అభివృద్ధి మిషన్ పథకం క్రింద 2025-26 ఆర్థిక సంవత్సరంలో 995 ఎకరాల్లో ఉద్యాన పంటలను అభివృద్ధి చేయనున్నారు. ఈ పథకంలో జీడిమామిడి, మామిడి, అరటి, బప్పాయి, కూరగాయలు, జామ, ఉసిరి, పనస, కోకో, పూలు తదితర పంటలకు వివిధ రకాల రాయితీ రూపంలో ఇవ్వనున్నాం.

? రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం ద్వారా రైతులకు అందించనున్న ప్రోత్సాహకాలు ఏమిటి? ఏమైనా యంత్ర పరికరాలు అందిస్తున్నారా?

రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం కింద ఈ సంవత్సరం 150 ఎకరాల సంకర జాతి కూరగాయల సాగు లక్ష్యంగా ఇవ్వడం జరిగింది. ఈ పథకం కింద ఎకరాకు రూ.8 వేలు వరకు రాయితీ అందిస్తున్నాం. అదేవిధంగా శాశ్వత సందళ్ల కొరకు ఎకరాకు ఒక రూ.లక్ష వరకు రాయితీ ఇస్తున్నాం. ఆర్‌కెవైవైలో ప్రస్తుతానికి ఎటువంటి యంత్ర పరణాలు అందించట్లేదు. అయితే సమగ్ర ఉద్యోవ అభివృద్ధి మిషన్ (ఎంఐడిహెచ్) ద్వారా మిని ట్రాక్టర్ రూ.1,96,004 (50 శాతం రాయితీ), పవర్ టిల్లర్ రూ.80 వేలు, (50 శాతం రాయితీ), తైవాన్ ఫవర్ స్ప్రేయర్లు రూ.80 వేలు (50 శాతం రాయితీ అందిస్తున్నాం.

? ఉద్యాన పంటల సాగు లాభదాయకమయ్యేలా రైతులకు మీరిచ్చే సూచనలేమైనా ఉన్నాయా?

బహువార్షిక వార్షిక పంటలైన ఉద్యాన పంటలు నాటిన వెంటనే లాభం, ఆదాయం రాదని చింతించకుండా మొదటి 3-4 సంవత్సరాల వరకూ కూరగాయలు, బొప్పాయి, అరటి, పసుపు వంటి పంటలను అంతర పంటలుగా వేసుకుని ఆదాయం పొందవచ్చు. కొబ్బరి, పామాయిల్ వంటి తోటల్లో అదనపు ఆదాయం తెచ్చే కోకో పంటను వేసుకోవచ్చు. ప్రస్తుతం కోకో గింజలకు మంచి గిట్టుబాటు ధర లభిస్తుంది. అదే విధంగా బొప్పాయి, పచ్చ వంటి పంటల్లో మల్చింగ్ విధానం పాటిస్తే కలుపు మందుల ఖర్చు తగ్గించడమే కాకుండా దిగుబడిని కూడా మూడింతలు పెంచుకుని స్థిరమైన ఆదాయం పొందవచ్చు. 90 శాతం రాయితీపై డ్రిప్, స్ప్రింక్లర్లను అమర్చుకోవడం ద్వారా 60-80 శాతం వీటిని ఆదా చేయడమే కాక డ్రిప్ ద్వారా పోషకాలను నేరుగా వేరు వ్యవస్థకు పంపించడం ద్వారా ఎరువుల వినియోగం తగ్గించడమే కాక అధిక దిగుబడులు పొందవచ్చు.



సామగ్రిని అందజేస్తున్న జగన్మోహనరావు

గిరిజనుల అభ్యున్నతికి కృషి

మందస: గిరిజన అభ్యున్నతికి రెడ్‌క్రాస్ సంస్థలు చేదోడు వాదోడుగా ఉంటుందని చైర్మన్ పి.జగన్మోహనరావు అన్నారు. మండలంలోని బలియావాడ, తాళ్లగోరెటి, చీపి గ్రామాల్లో 42 కుటుంబాలకు టార్పాలిన్లు, వంట సామగ్రి కిట్లు, దుప్పట్లు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అవసరమైన వృత్తి నైపుణ్యాలు అందించడం ద్వారా గిరిజన యువత ఆర్థికంగా నిలబెట్టడానికి అవకాశం కలుగుతుందన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాల్లో కూడా సాంకేతికత, మార్కెటింగ్ నైపుణ్యాలు అందిస్తామన్నారు. రెడ్‌క్రాస్ సిబ్బంది కె.సత్యనారాయణ, జి.రమణలు కొండచర్యలు పడినప్పుడు, వరదలు, తుపాన్లు వచ్చిన సమయాల్లో ఎలాంటి జాగ్రత్తలు తీసుకుని ప్రాణ ఆస్తి నష్టని తగ్గించుకోవాలనే అంశంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బూర్జ మండలం పెద్దపేట ఆర్ఫ్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రెసిడెంట్ నూక సన్యాసిరావు, రెడ్‌క్రాస్ సిబ్బంది ఉమాశంకర్, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

నరసన్నపేట: స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సిఎం సహాయ నిధి చెక్కులను ఆదివారం అందజేశారు. జలుమూరు మండలం సైరిగాంకు చెందిన రామారావుకి అనారోగ్యం కారణంగా వైద్య ఖర్చులు కోసం రూ.1,00,016, సారవకోట మండలం కుమ్మరిగుంట పంచాయతీ చోడసముద్రానికి చెందిన పట్ట సత్యనారాయణ కుడి కాలు సర్జరీకి రూ.38,084ల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, లింగాలవలస సర్పంచ్ దుంగ స్వామిబాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షునిగా 'పేడాడ'

ఆమదాలవలస: కళాకారుల సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడిగా పేడాడ ధనుంజయరావును ప్రధాన కార్యదర్శిగా బగాది తేజేశ్వరరావులను ఏకగ్రీవంగా సంఘసభ్యులు ఎన్నుకున్నారు. ఆదివారం పట్టణంలో సంఘ సమావేశాన్ని నిర్వహించారు. కళాకారులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రధానంగా చర్చించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా టేకు త్రినాథరావు, సహాధ్యక్షులుగా బొడ్డేపల్లి జనార్ధనరావు, కోశాధికారిగా కొంచాడ రామారావు, ఉపాధ్యక్షులుగా దాస్యం లక్ష్మణరావు, ఎన్.చంద్రశేఖరరావు, జి.జోగారావు పివిఎన్ మాస్టారు, టి.విశ్వేశ్వరరావు, ఎ.రామాచారి, సంయుక్త కార్యదర్శిగా మొబాగాపు ఈశ్వరరావు, కార్యదర్శిగా కె.రాములు నాయుడు, కె. సంజీవరావు, పిడి కుమార్, ఎన్. వాసుదేవరావు, బి. గోవిందరావు, కె.భాస్కరరావు, కార్యవర్గ సభ్యులుగా పి.గోవిందరావు, ఎల్.విశ్వేశ్వరరావు, బి.గోపాలరావు, పి.రాజులు, బి. దుర్గారావు, సిహెచ్ ఆదినారాయణ, టి. సత్యనారాయణ, బి.సూర్య నారాయణ, కె. తిరుపతమ్మను ఎన్నుకున్నారు.

గుండె జబ్బులపై అప్రమత్తం

హృద్రోగ వైద్యులు ఫణీంద్ర

శ్రీకాకుళం ప్రతినిధి: గుండె జబ్బులపై అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ హృద్రోగ నిపుణులు డాక్టర్ ఫణీంద్ర అన్నారు. వాకర్స్ ఇంటర్నేషనల్–102 గవర్నర్ కొంక్యాన మురళీధర్ ఆధ్వర్యాన నగరంలోని వాసవీ కళ్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన ఆరోగ్యం, అవగాహనా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆరోగ్యంగా కనిపించే మనిషి అకస్మాత్తుగా గుండెపోటుకు గురవు తుంటారని, అందువల్ల పరీక్షలను ఎప్పటికప్పుడు చేయించుకుంటూ జాగ్రత్త వహించాలని అన్నారు. సాయి డెంటల్ కళాశాల చైర్మన్ డాక్టర్ మధుకర్ విలేకర్ మాట్లాడుతూ గతం కంటే ఇప్పుడు దంత సమస్యలు ఎక్కువగా నమోదవుతున్నాయని, మధ్య వయసులు, వృద్ధులు దంత వ్యాధులపై జాగ్రత్త వహించాలన్నారు. వాకర్స్ పూర్వ గవర్నర్లు కర్రోతు సత్యం, జి.ఇందిరాప్రసాద్, జి.సత్యనారాయణ, పి.ఉమామహేశ్వరరావు, పి.జి.గుప్తా, కె.వి.ఆర్.మూర్తి, వాకర్స్ ప్రతి నిధులు ఎస్.జోగినాయుడు, కొంక్యాన వేణుగోపాల్, సుగంధం సంజీవరావు పాల్గొన్నారు.



బూర్జ : విద్యార్థుల ఆత్మీయ కలయిక

సరదాగా... సందడిగా

కవిటి: వాళ్లంతా కలిసి 20 ఏళ్లు దాటింది. ఇన్నాళ్లకి మళ్లీ తాము చదువుకున్న పాఠశాలలు వారి ఆత్మీయ కలయికకు వేదికయ్యాయి. ఒక్కదగ్గరకు చేరిన వారంతా బాల్యస్మృతులను నెమరు వేసుకున్నారు. చేసిన చిలిపి చేష్టలు, గురువుల మందలింపులు గుర్తుచేసుకున్నారు. తమకు విద్య బుద్ధులు నేర్పిన గురువులను సత్కరించి సాష్టాంగ నమస్కారాలు చేశారు. తాము చదువుకున్న పాఠశాల కలియతిరుగుతూ ఆత్మీయ ఆలింగనాలు చేసుకున్నారు. ఈ అపూర్వ ఘట్టాలకు ముత్యాలపేట, బొరివంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు వేదికలయ్యాయి.

బూర్జ: మండల కేంద్రమైన బూర్జ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1992 – 93 పదోతరగతి స్నేహితులు బ్యాచ్ ఆదివారం బూర్జ హైస్కూల్లో కలుసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులతో సహా హాజరై ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులను ఆహ్వానించి ఘనంగా సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. ఈ బ్యాచ్‌లో చదువుకుని వివిధ కారణాలతో మరణించిన వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించారు. హెచ్ఎం లక్ష్మి నారాయణ, గంగు రామచంద్రరావు (రాంబాబు), గోద ఫణీంద్ర, కలివరపు శ్రీనివాసరావు, తొత్తడి సురేష్, మజ్జి సత్యనారాయణ, తొత్తడి మధుబాబు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: స్థానిక సత్య సాయి విద్యా సంస్థలో 1999లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు విజి ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పాత జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. సత్యసాయి విద్యా సంస్థల వ్యవస్థాపకులు కృష్ణమూర్తి సతీమణి లక్ష్మిని సన్మానించారు. దివాకర్, నాగేశ్వరరావు, దేవరాజు, లోహిదాస్, దుర్గిప్రసాద్ పాల్గొన్నారు.

యోగాకు అందరూ ఆహ్వానితులే

శ్రీకాకుళం: నగరంలోని 80 అడుగుల రోడ్డులో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా రోజూ ఉదయం 6.30 నుంచి 7.30 గంటలకు యోగా శిక్షణా శిబిరం నిర్వహిస్తున్నామని, అందరూ పాల్గొవాలని జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ పి.జగదీష్ పిలుపునిచ్చారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆదివారం మెప్మా అధికారులు, సిబ్బంది ఆదివారం పాల్గొన్నారు. యోగా శిక్షణలో పాల్గొనడానికి అందరూ ఆహ్వానితులేని అన్నారు. కార్యక్రమంలో ఆయుష్ కాంపౌండర్ జె.చంద్రశేఖరరావు, యోగా శిక్షకులు మురళి, స్వాతి పాల్గొన్నారు.

సామూహికంగా... సమగ్రంగా

ఉద్ధానం ఉద్యానవన పంటలను అతలాకుతం చేస్తున్న తెల్లదోమ, గ్యానోడెర్మ నివారణకు రైతులందరూ సామూహికంగా, సమగ్రంగా సస్యరక్షణ చర్యలు తీసుకుంటే వాటి వ్యాప్తిని చాలావరకూ నియంత్రించవచ్చని ఉద్యాన పరిశోధన కేంద్రం పెద్దపేట శాస్త్రవేత్త డాక్టర్ రాజశేఖర్ తెలిపారు. ఈ మేరకు 'ప్రజాశక్తి'తో మాట్లాడిన ఆయన వీటి నివారణకు తీసుకోవాల్సిన, చేపట్టాల్సిన జీవ నియంత్రణ పద్ధతులు తెలియజేశారు.

- **యాజమాన్య పద్ధతుల్లో వ్యాధుల నివారణ**
- **ఉద్యాన పరిశోధన కేంద్రం పెద్దపేట శాస్త్రవేత్త డాక్టర్ రాజశేఖర్**



ప్రజాశక్తి– కవిటి

ఈ మధ్యకాలంలో కొబ్బరితో పాటు ఆయిల్‌పామ్, మామి డి, పనస, అరటి, సీతాఫలం వంటి పండ్ల తోటలను అలాగే అనేక అలంకార జాతుల పూల మొక్కలను ఆశిస్తూ తీవ్రమైన నష్టం కలిగిస్తున్న అన్యదేశపు కీటకమైన రూగస్ సర్పిలాకారా తెల్లదోమ నియంత్రణకు రైతులందరూ సామూహికంగా సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా దీనిని నివారించవచ్చని డాక్టర్ రాజశేఖర్ చెబుతున్నారు.

తెల్లదోమ నియంత్రణకు యాజమాన్య పద్ధతులు

తెల్లదోమ నివారణకు జీవ నియంత్రణ ప్రధాన ఆయుధం. ముఖ్యంగా తెల్లదోమ సోకిన కొబ్బరి మొక్కలను ఒక చోట నుంచి మరోచోటికి తరలించకూడదు. తెల్లదోమ ఉధతి తక్కువగా ఉన్నప్పుడు 100 నుంచి 150 సుడోమల్లాడ ఆస్టర్ గుడ్లను, మధ్యస్థంగా ఉన్నప్పుడు 200 నుంచి 300 గుడ్లను ఒక్కో చెట్టుకు క్లిప్పింగ్ చేయాలి. అలాగే మిత్ర పురుగైన ఎన్ కార్సియా గ్వడలోపే బదనికలు తెల్లదోమ ఆశించిన ప్రాంతంలో విడుదల చేయాలి. సర్పిలాకారా తెల్లదోమ కోసం పురుగు మందులు వాడకూడదు. అందువల్ల అవాంచిత పురుగు మందుల వాడకం నివారించి మిత్ర పురుగులను పెంచుకోవాలి. ముఖ్యంగా పసుపు రంగు జిగురు అట్టలను కొబ్బరి చెట్టు కాండానికి కట్టి ఏడు నుంచి పది రోజులకు ఒకసారి వాటికి ఆముదపు నూనెను పూయాలి. బసేరియా ఫ్యూమ సోరోసియా ఏంటమోపాథోజనిక్ శిలీంద్రాన్ని లీటరు నీటిలో 5 గ్రాములు కలిపి ఆకులపై పిచికారి చేయాలి.

గ్యానోడెర్మ

కొబ్బరి తోటలను ఆశించే తెగుళ్లలో గ్యానోడెర్మా చాలా ముఖ్యమైనది, అత్యంత ప్రమా దకరమైనది. దీనిని సిగతెగులు, ఎర్రలక్క తెగులు, బంకకారు తెగులు, పొట్టులక్క తెగులు అని కూడా అంటారు. ఈ తెగులు నల్లనేలల్లో కంటే తేలిక నేలల్లోని కొబ్బరి తోటల్లో ఎక్కువగా కనిపిస్తుంది. వ్యాప్తి కూడా తేలికనేలల్లో విస్తా రంగా ఉంటుంది. ఈ తెగులు తీవ్రత వ్యాప్తి నీటి ఎద్దడి అధికంగా ఉన్న తోటలో ఎక్కువగా ఉంటుంది.

లక్షణాలు

గ్యానోడెర్మ తెగులు నేలలో ఉండే బూజు జాతి శిలీంద్ర బీజముల వలన కొబ్బరికి సోకుతుంది. గ్యానోడెర్మ తెగులు మొదట భూమిలో ఉండే వేర్లను ఆశిస్తుంది. దీంతో అధిక శాతం వేళ్లు కుళ్లిన తర్వాత కాండంలోకి వ్యాపించి కణాలు పూర్తిగా కుళ్లేలా చేస్తుంది. ఆ తర్వాత క్రమక్రమంగా ఈ తెగులు వేర్ల నుంచి కాండంలోకి ప్రవేశిస్తుంది. ఈ దశలో కాండం మొదలు చుట్టూ ఉన్న చిన్న చిన్న పగుళ్ల నుంచి ముదుర గోధుమ రంగునుంచి తెలుపు రంగు కలిగిన చిక్కటి ద్రవం కారడం గమనించవచ్చు. కాండంలోని కణసముదాయం పూర్తిగా కుళ్లిపోవడం వల్ల చెట్టుకు అవసరమైన నీరు, పోషక లవణాలను భూమి నుంచి తీసుకోలేక పోతుంది. ఈ దశలో జిగురు కారుతూ అది క్రమేపి పైకి వ్యాపిస్తుంది. తెగులు సోకిన చెట్టు ఆకులు పసుపు రంగులోకి మారి వడలిపోయి ఆ తరువాత గోధుమ రంగులోకి మారుతాయి. కొత్త ఆకులు ఆలస్యంగా రావడం వల్ల తెగులు సోకిన చెట్టుపై ఆకుల సంఖ్య తక్కువగా ఉండడం గమనించవచ్చు. ఆ తరువాత కొబ్బరి ఆకులు పూర్తిగా రాలిపోవడం వలన కాండము మొండిగా తయారై కొబ్బరి చెట్టు చెక్కిన పెన్సిల్ మొన మాదిరిగా కనిపిస్తుంది.



గ్యానోడెర్మ సోకిన చెట్టు

యాజమాన్య పద్ధతులు

గ్యానోడెర్మ తెగులు లక్షణాలు గమనించిన వెంటనే ఒక మీటరు లోతు, 50 సెంటీమీటర్ల వెడల్పుతో గోతిని తవ్వి తెగులు సోకిన చెట్ల నుంచి వేరు చేయాలి. ఆ తరువాత చనిపోయిన చెట్ల స్థానంలో తిరిగి మొక్కలు నాటే ముందు తీసిన గుంతలను వారం పది రోజులు బాగా సూర్యరశ్మి తగిలి ఎండేలా చేయాలి. వాటిలో చెత్తాచెదారం వేసి కాల్చడంవల్ల వేరు కుళ్లి శిలీంద్రాలను నియంత్రించవచ్చు. అలాగే కొత్త మొక్కలు నాటేటప్పుడు చెత్త వేసి కాల్చిన గోతుల్లో బాగా చివికిన పశువుల ఎరువు, కంపోస్ట్ ఎరువులతో పాటు 50 గ్రాముల ట్రైకోడెర్మా విరిడి అనే శిలీంద్రపు పొడిని ఒక కిలో వేపపిండి మిశ్రమంతో నింపి మొక్కలు నాటాలి. గ్యానోడెర్మ తెగులు కలిగించే శిలీంద్ర బీజాలు నేలలో ఉండి తెగిన లేదా దెబ్బతిన్న వేర్ల ద్వారా చెట్లకు వ్యాపిస్తుంది. కనుక కొబ్బరి చెట్ల వేరు నరకడం, తెగినంతవరకు లోతుగా దుక్కి చేయడం పనికిరాదు. ఎట్టి పరిస్థితుల్లో చెట్లు వేర్లు నరకకూడదు. ఈ తెగులు ఎక్కువగా తేలిక నేలల్లో వస్తుంది. అందువల్ల ఈ తేలిక నేలల్లో జీలుగు, జనుము వంటి పచ్చిరొట్ట పంటలు చిక్కగా పెంచి పూత దశకు వచ్చే సమయంలో భూమిలో కలియదున్నాలి. చెట్లు మొదలు చుట్టూ రెండు మీటర్ల వ్యాసార్ధం గల పల్లాలు చేసి బోదెల ద్వారా ప్రతి చెట్టుకు విడివిడిగా నీరు పెట్టాలి. అలాకాకుండా తోటకు మొత్తంగా నీరు చేసి పెడితే గ్యానోడెర్మ శిలీంద్రము నీటి ద్వారా అన్ని చెట్లకు వ్యాపిస్తుంది. ఈ తెగులు ఉన్న నేలల్లో కొబ్బరి చెట్టుకు ప్రతి సంవత్సరం 125 గ్రాములు ట్రైకోడెర్మా విరిడి, 125 గ్రాములు సూడో మోనాస్ ఫ్లోరిసెన్స్ సిలింద్రపు పొడిని ఐదు కిలోల వేప పిండిలో కలిపి ఏడాదికి ఒకసారి వేయాలి. ముఖ్యంగా ట్రైకోడెర్మా శిలీంద్రపు పొడిని బోర్నో మిశ్రమంతో లేక ఇతర తెగులు మందులతో కలిపి వాడకూడదు.



తెల్లదోమ ఆశించిన ఆకులు

జనసేన సభ్యత్వ కార్డుల పంపిణీ

బూర్జ: మండలంలోని హనుమయ్యపేటలో ఆదివారం జనసేన ఆధ్వర్యంలో సభ్యత్వ కార్డులను పంపిణీ చేశారు. జనసేన నాయకులు కొత్తకోట నాగేంద్ర, జనసేన మండల అధ్యక్షులు కోరుకొండ మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ కార్డులను గ్రామంలోని సభ్యత్వాలు నమోదు చేసుకున్న వ్యక్తులకు ఇంటింటికి వెళ్లి అందజేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కర్నూల్ రాంబాబు, ఐడి హేమంత్ కుమార్, బొంగు రాంబాబు, రాముతో పాటు కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



శిక్షణ ఇస్తున్న కోచ్ అప్పన్న

విద్యార్థులకు ప్రశంసాపత్రాలు

బూర్జ: అథ్లెటిక్స్‌లో విద్యార్థులకు ఆదివారం ప్రశంసా పత్రాలు అందజేసినట్లు శిక్షణ కోచ్ అప్పన్న తెలిపారు. మండలంలోని కె.కె.రాజపురం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మే నెల 1 నుంచి అథ్లెటిక్స్‌లో వేసవి శిక్షణా శిబిరాన్ని నిర్వహించామని, శిక్షణ పొందిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేయడం జరిగిందని ఆయన తెలిపారు.

విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి– ఆమదాలవలస

పురపాలక సంఘం పరిధిలోని 22వ వార్డు లక్ష్ముడు పేటలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో అద్భుత శిక్షణ అపూర్వ జ్ఞాపకశక్తిపై అంతర్జాతీయ జ్ఞాపక శక్తి ట్రైనర్ బొడ్డేపల్లి నరేష్ కుమార్ ఆనంద ఫౌండేషన్ సహకారంతో విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు జ్ఞాపక శక్తి ఎలా పెంపొందించాలి అనే అంశంపై అవగాహన కల్పించారు. చదువుకునే పదాలను, ఆట వస్తువులను గుర్తుంచుకొని ఎలా అవగాహన చేసుకోవాలో వాళ్లకి అర్థమయ్యే రీతిలో గుర్తుండేలా తెలియజేశారు. ఈ సందర్భంగా ఆనంద ఫౌండేషన్ వ్యవస్థాపకులు పైడి మనోహర్ విద్యార్థులకు అద్భుత శిక్షణను అందించిన నరేష్ కుమార్‌కు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు, యువత పాల్గొన్నారు.

ఎండియు వాహనాల రద్దు అన్యాయం

శ్రీకాకుళం : ఎండియు వాహనాలు రద్దు చేయడంతో బండిలో ఉన్న కంప్యూటర్ కాటా సర్వీస్ ఇంజినీర్ల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని ఇంజినీర్ బి.అనంతకుమార్ ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, కాకినాడ, ఒంగోలు, ఏలూరు తదితర జిల్లాలకు ఎంవిఆర్ టెక్నాలజీ తరపున నాలుగేళ్లుగా పనిచేస్తున్న తమ బతుకుల్లో నీళ్లు చల్లడం సరికాదన్నారు. కూటమి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడంతో కుటుంబాలతో రోడ్డున పడతామన్నారు

క్రికెట్ పోటీలు ప్రారంభం

కవిటి: కవిటి కళాశాల క్రీడా ప్రాంగణంలో నియోజకవర్గస్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఎస్‌సిసిసి క్రికెట్ క్లబ్ ఆధ్వర్యాన జరుగుతున్న ఈ పోటీలు ఆదివారం లాంఛనంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో బెందాళం రమేష్, ఆరింగి మధు, పాండవ చంద్రశేఖర్, బెందాళం రమణ, బెందాళం సురేష్ పాల్గొన్నారు.

పశువుల దాన పంపిణీ

పాతపట్నం: పాతపట్నంలో పాడి రైతులకు 50 శాతం రాయితీపై పోషకాలతో కూడిన పశువుల దాన ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పశువుల పెంపకందారులకు పోషకాలతో దాణా అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు పైల బాబ్జి, సైలాడ సతీష్, సలాన మోహనరావు, మండల స్పెషల్ ఆఫీసర్ మంచు కరుణాకరరావు పాల్గొన్నారు.

మృతదేహాలను అప్పగించకపోవడం అన్యాయం

ప్రజాశక్తి– శ్రీకాకుళం ప్రతినిధి



మాట్లాడుతున్న జనార్దనరావు

ఛత్తీస్‌ఘర్ రాష్ట్రం నారాయణపూర్ ఎన్‌కౌంటర్‌లో మరణించిన మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాల కేశవరావుతో సహా ఎపికి చెందిన మరో ఇద్దరి మృతదేహాలను వారి బంధువులకు అప్పగించకపోవడం అన్యాయమని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి పి.ప్రసాద్, జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్, సహాయ కార్యదర్శి వంకల మాధవరావు అన్నారు. ఎపి హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చినా మృతదేహాలను అప్పగించకపోవడాన్ని ఆదివారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఉత్తర్వు కాపీతో మృతదేహాల కోసం నారాయణపూర్ వెళ్లిన కేశవరావు సోదరుడు నారాయణపూర్ ఆదివారం ఉదయం నుంచి రాత్రి 6 గంటల వరకు నిరీక్షణ చేసినా ఫలితం కనిపించలేదన్నారు. ఎపి పోలీస్ ఉన్నతాధికారుల నుంచి తమపై వస్తున్న ఒత్తిళ్ల వల్లనే ఛత్తీస్‌ఘర్ పోలీస్ వర్గాలు మృతదేహాల్ని ఇవ్వ నిరాకరిస్తున్నట్లు తెలుస్తోందని వారన్నారు.

ఆమదాలవలస : కమ్యూనిస్టు నాయకుడు నంబాల కేశవరావు మృతదేహాన్ని ప్రభుత్వం ఆయన కుటుంబసభ్యులకు అప్పగించాల్సిందేనని విశ్రాంత తహశీల్దార్, కళింగ సంఘ నాయకులు పేడాడ జనార్దనరావు అన్నారు. ఆదివారం రెండోవార్డు కృష్ణాపురంలో ఆయన మాట్లాడుతూ నంబాల మృతదేహాన్ని ఆయన కుటుంబ సభ్యులకు అప్ప గించేందుకు జిల్లా అధికార యంత్రాంగం వెనుకడుగు వేస్తుందని, అధికారుల తీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా కళింగ సంఘ నాయకులు కేశవరావు మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చే విధంగా కృషి చేయాలన్నారు. సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ కూన అప్పల నాయుడు ఉన్నారు.

వేటకు వెళ్లి మత్స్యకారుడు మృతి



గురుమూర్తి మృతదేహం

పోలాకి: మండలంలో రాజార్ణాపురానికి చెందిన మత్స్యకారుడు దౌలుపల్లి గురుమూర్తి (52) వేటకు వెళ్లి ఆదివారం వేకువ జామున వెళ్లాడు. సముద్రం, వంశధార నది కలిసే మగ వద్ద చేపలను పడు తున్నాడు. సముద్రం ఆల ఉధృతికి తెప్ప బోల్తా పడడంతో మగలో పడిపోయాడు. అనంతరం మృతదేహం వంశధార నది ఒడ్డుకు కొట్టుకొచ్చింది. సమాచారం అందుకున్న సిఐ ఎం.శ్రీనివాసరావు, ఎస్ఐ రంజిత్ ఘటనాస్థలానికి చేరుకుని శవ పంచ నామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం నరసన్నపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. భార్య తులసి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

పాతపట్నం : మండలంలోని ఈ నెల 26న ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 11 కెవి లైన్ నిర్వహణలో భాగంగా సరియాపల్లికి సరఫరా నిలుపుదల చేస్తున్నామని విద్యుత్‌శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు.



కోటబొమ్మాళి : తల్లిదండ్రులకు సూచనలు చేస్తున్న శ్రీనివాస్

పిల్లలపై శ్రద్ధ వహించాలి

పలాస: ప్రయాణ సమయంలో బస్టాండ్, రైల్వే స్టేషన్, జాతరలో జనం రద్దీగా ఉండే ప్రదేశాల్లో తల్లిదండ్రులు తమ పిల్లల విషయంలో చాలా జాగ్రత్తలు పాటించాలని బార్ అసోసియేషన్ బార్ ఉపాధ్యక్షుడు బి.కె.ఆర్.పట్నాయక్ అన్నారు. ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆవరణలో అంతర్జాతీయ తప్పిపోయిన పిల్లల దినోత్సవం వేడుకలు సందర్భంగా ఆదివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మగ పిల్లలను వెట్టిచాకిరికి, ఆడవాళ్లు ఇతర దేశాల్లో అమ్మి వేస్తున్నారని, అందువల్ల వాళ్ల జీవితం ఛిద్రం అవుతుందని అన్నారు. ఎవరైనా ఒంటరిగా ఉన్న పిల్లలను చూస్తే దగ్గర్లో ఉన్న పోలీస్ స్టేషన్, బాలల సంరక్షణ సంస్థ, 100, 1098 టోల్ ఫ్రీ నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎజిపి పిండి వెంకటరావు, బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ అనిల్ రాజు, న్యాయ వాదులు లోకేశ్వరరావు, దేవరాజు, ఆర్‌టిసి డిపో అసిస్టెంట్ మేనేజర్ సంతోష్‌కుమార్ కానిస్టేబుల్ బాబూరావు, పారా లీగల్ వాలంటరీ సునీల్‌కుమార్, తిరుపతిరావు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: పిల్లలు నడవడిక, తదితర అంశాలను అప్పటికప్పుడు పరిశీలిస్తూ... వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు లఖినేని శ్రీనివాస్ అన్నారు. అంతర్జాతీయ తప్పిపోయిన పిల్లల దినోత్సవం సందర్భంగా కోటబొమ్మాళి ఎన్‌టిఆర్, ఎర్రన్నాయుడు పార్కు వద్ద న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు.



విచారణ చేస్తున్న డిఎస్‌పి శ్రీనివాసరావు

ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు విచారణ

ప్రజాశక్తి– టెక్కలి రూరల్

మెళియాపుట్టి మండలం సుర్జినిలో 2016లో శ్రీరామనవమి సందర్భంగా దళిత దండాసి నూతన దేవాలయ ప్రవేశానికి సామూహిక బహిష్కరణకు గురైన కేసును శ్రీకాకుళం ఎస్‌సి, ఎస్‌టి కోర్టు కేసును కొట్టివేసింది. తరువాత దళితులు మా కేసును పబ్లిక్ ప్రాసిక్యూటర్ మమ్మలను మోసం చేశారని, ఈ కేసును మళ్లీ సాక్షులను విచారించి న్యాయం చేయాలని కులనిర్మూలనా పోరాట సమితి అధ్వర్యాన నేషనల్ ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ న్యూఢిల్లీకి ఫిర్యాదు చేశారు. కమిషన్ ఆదేశాల మేరకు టెక్కలి డిఎస్‌పి కార్యాలయంలో శ్రీకాకుళం అడిషనల్ ఎస్‌పి శ్రీనివాసరావు ఆదివారం విచారణ చేపట్టారు. దండాసి బాధితుల వాంగ్మూలం తీసుకొన్నారు. ఈ విచారణలో కుల నిర్మూలన పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బెలమర ప్రభాకర్, బాధిత కుటుంబాలు ప్రతినిధులను రామారావు, సింహాద్రి, మోహన్‌లు పాల్గొన్నారు.

శివారు భూములకు సాగునీరు

పలాస: రానున్న ఖరీఫ్ సీజన్‌లో శివారు భూములకు సాగునీరు అందిస్తామని నీటి సంఘం అధ్యక్షుడు గొనప నిరంజన్ అన్నారు. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని చినబడాం నీటి సంఘం ప్రాంతంలో వంశధార కాలువలో పూడికతీత పనులను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతేడాది కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అతి తక్కువ సమయంలో వంశధార నీటిని శివారు భూములకు అందించామని చెప్పారు. ఈ ఏడాదీ పూర్తిస్థాయిలో వంశధార నీటిని అందించేందుకు ఎమ్మెల్యే గౌతు శిరీష చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు.



పనులను ప్రారంభిస్తున్న టిడిపి నాయకులు

కార్యక్రమంలో టిడిపి నాయకులు లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, బి.నాగరాజు, నర్సింహులు, దడిలియాల నర్సింహులు, సవర రాం బాబు, సంపతిరావు ధనుంజయ, కోట్ని దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఆటోల్లో 'సురక్ష'తంగా ప్రయాణం చేయొచ్చు



సురక్ష స్టిక్కర్‌ను అంటిస్తున్న ఎస్ఐ లావణ్య

పాతపట్నం: ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి ఈ నెల 17న జిల్లాలో ఉండే ఆటోలకు సురక్ష పేరుతో క్యూఆర్ కోడ్ గల స్టిక్కర్లను అంటించి ప్రారంభించారని ఎస్ఐ బి.లావణ్య తెలిపారు. ఈ మేరకు మండలంలోని ఆటోలకు సురక్ష క్యూఆర్ కోడ్ స్టిక్కర్లను ఆదివారం అమర్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏదైనా ఆపద ఉన్నామని గ్రహించిన వెంటనే క్యూఆర్ కోడ్ను స్కాన్ చేస్తే ఆటో పూర్తి వివరాలు, మీరు ఎక్కడికి ప్రయాణిస్తున్నారు, లైవ్ లొకేషన్ సదరు పోలీస్ స్టేషన్‌కు చేరుతాయని అన్నారు. వెంటనే ఆపదలో ఉన్న వారికి పోలీసులు సురక్షితంగా కాపాడుతారని తెలిపారు. అలాగే ప్రమాదాల సమయంలో సమాచారం, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలకు పటిష్టం చేయవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో ఎఎస్ఐ అప్పారావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు



పట్టుబడిన మద్యం సీసాలతో ఎస్ఐ

పాతపట్నం: మండలంలోని తెంబూరుకు చెందిన నందాన శ్రీనివాసరావు తన పాన్‌షాపులో అక్రమంగా బెల్ట్‌షాపు నిర్వహిస్తున్నాడు. ఆదివారం సాయంత్రం అమ్మడానికి మద్యంషాపు నుంచి 12 మద్యం సీసాలు తీసుకు వెళ్తుండగా ఎస్ఐ బి.లావణ్య తన సిబ్బందితో తెంబూరు వై జంక్షన్ వద్ద పట్టుకున్నట్లు తెలిపారు. ఆయన వద్ద 12 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. మండలంలో ఎవరైనా అక్రమంగా మద్యం, నాటు సారా, ఖైనీ, గుట్కాలు విక్రయిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

6 నుంచి పెంటపోలమ్మ జాతర

పలాస: కాశీబుగ్గ పదో వార్డు పెంట, పొందరవీధిల్లో పెంటపోలమ్మ అమ్మవారి జాతర వచ్చే నెల జూన్ 6 నుంచి 10 వరకు జాతర నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు పెంట సంజీత్, రూప్ సుందర్, విజయ్, ఉమాకాంత్, శివ, రాజేందర్, కామేశ్వరరావు అన్నారు. ఈ మేరకు కాశీబుగ్గలోని పెంటపోలమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం సమావేశం నిర్వహించి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ ఐదు రోజుల పాటు ఊరేగింపు, డప్పులు, వేషాలు, మేల తాళాలు, తప్పెడు గుళ్లు, కాళికా వేషాలు ఉంటాయని అన్నారు. అలాగే లక్కీ డ్రా కూడా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు హరి, పూర్ణ, నేతాజీ, అనిల్, సుధాకర్, కన్న, విశ్వనాథ్, ప్రసాద్, సాయి, అజయ్, రాజేష్ పాల్గొన్నారు.




పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సభ్యులు

సిసి రోడ్లపై పశువులు

స్పందించని అధికారులు

ప్రజాశక్తి– ఆమదాలవలస

రాష్ట్రంలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలో సిసి రహదారులు, డ్రైనేజీల నిర్మాణాలు శరవేగంగా పూర్తి చేసుకుంటున్నాయి. నిర్మాణాలతో పల్లెల్లో పండుగ వాతావరణం కనిపిస్తున్నప్పటికీ కొంతమంది వ్యక్తుల దురాక్రమణ చర్యలతో గ్రామాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సరుబుజ్జిలి మండలంలోని చిగురువలస గ్రామ పంచాయతీలో పల్లె పండుగ కార్యక్రమం ద్వారా సుమారు రూ.కోటి ఉపాధిహామీ నిధులతో సిసి రహదారులు, డ్రైనేజీలు నిర్మాణాలు పూర్తి చేశారు. అయితే చిగురువలసలోని ప్రధానవీధిలో నూతన సిసి రహదారిపై ప్రతిరోజు గ్రామానికి చెందిన భూస్వాములు, పెత్తందారులు రోడ్డుకు అడ్డంగా పశువులను కట్టడం ప్రారంభించారు. దీంతో రహదారి పూర్తిగా అపారిశుధ్యంగా మారడంతో పాటు పిల్లలు, వృద్ధులు ఆ రహదారిలో నడవడానికి భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. దీనిపై కొంతమంది గ్రామస్తులు వారితో వారించలేక కార్యదర్శికి ఫిర్యాదు చేయగా రోడ్డుపై పశువులు కడుతున్న వ్యక్తులకు నోటీసులు కూడా ఇవ్వడం జరిగింది. అధికారులు నోటీసులు ఇచ్చినప్పటికీ వారిలో ఎటువంటి మార్పు లేకుండా ఎప్పటి వలే యధావిధిగా రహదారిపైనే పశువులు కడుతున్నారని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు ముక్తకంఠంతో కోరుతున్నారు.



సిసి రహదారిపై కట్టిన పశువులు

నిబంధనలు వీరికి వర్తించవా ..?

చూసి చూడనట్లు వ్యవహరిస్తున్న ఎక్సైజ్ అధికారులు

సరుబుజ్జిలి: సరుబుజ్జిలి మండల కేంద్రంలో ఉన్న మద్యం దుకాణంలో నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు జరుగుతున్నప్పటికీ సంబంధిత ఎక్సైజ్ అధికారులు చూసిచూడనట్లు వ్యవహరించడంలో ఆంతర్యమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలు వీరికి వర్తించవా అంటూ ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మద్యం దుకాణాలను బడి, గుడి, ప్రభుత్వ కార్యాలయాలకు దూరంగా ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ చర్చి పక్కనే మద్యం దుకాణం ఏర్పాటు చేయడంలో ఆంతర్యం ఏమిటో ఎవరికి అంతు పట్టడం లేదని పలువురు చర్చించుకుంటున్నారు. సరుబుజ్జిలి, మదనాపురం రహదారిలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణం చర్చికి కూతవేటు దూరంలో ఏర్పాటు చేయడంతో చర్చికి ప్రార్థనలకు వచ్చే క్రైస్తవులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బహిరంగంగా చెప్పేందుకు భయపడుతున్నామని పలువురు పేర్కొంటున్నారు. గతంలో ఇదే విషయమై పత్రికల్లో వార్తలు రావడంతో ఎక్సైజ్ అధికారులు వచ్చి కొలతలు వేసి హంగామా చేశారు తప్ప ఒరిగిందేమీ లేదని పలువురు చెబుతున్నారు. లోపాయికారి ఒప్పందంతో సమస్యను నీరుగార్చారని పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. మద్యం దుకాణం నిర్వాహకులు తమ వ్యాపారాన్ని పెంచుకునేందుకు నేరుగా బెల్ట్ షాపులకు ద్విచక్ర వాహనాలతో బహిరంగంగానే మద్యాన్ని తరలిస్తున్నప్పటికీ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు ఎక్సైజ్ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అనధికార పర్మిట్ రూములు ఏర్పాటు చేసి మందు బాబులకు మందు, విందులను ఏర్పాటు చేసి సొమ్ము చేసుకుంటున్నప్పటికీ ఎక్సైజ్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



తరలించేందుకు ద్విచక్ర వాహనంపై ఉంచిన మద్యం బాటిళ్ల బాక్స్